అనుమతి లేకుండా డీజే వాడొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై శేఖర్

ఘట్‌కేసర్: రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో అనుమతి లేకుండా డీజే వాడరాదని ఎస్సై శేఖర్ అన్నారు. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫంక్షన్‌హాల్ యజమానులు, డీజే సౌండ్ సిస్టం ఉన్న వారికి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అనుమతి లేకుండా డీజే వాడితే వారిపై ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వినతి


విద్యుత్ ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలోని శ్రీ విష్ణు శివాలయంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆలయ కమిటీ సభ్యులు విద్యుత్‌శాఖ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ఆలయ సమీపంలో విద్యుత్ స్తంభాలు లేక నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. 10 ఇంటర్‌పోల్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ ఏడీఈ అధికారికి ఆలయ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్, వెంకటేష్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



మేడ్చల్: పట్టణంలోని 3వ వార్డు అత్వెల్లిలో పని చేసే మున్సిపల్ కార్మికులకు కౌన్సిలర్ జకట దేవ దుస్తులు పంపిణీ చేశారు. దసరా పండగ సందర్భంగా తన స్వంత డబ్బులతో కౌన్సిలర్ తన వార్డులో పని చేసే కార్మికులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో స్వీపర్లు, వాటర్‌మెన్‌లు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సన్మానం

కీసర: కీసర మండలం నుంచి తొలి మహిళా హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేసిన యాద్గార్‌పల్లికి చెందిన జస్టిస్ గాలి గళ్ల శైలజను గురువారం కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్ మాట్లాడుతూ.. గాలి గళ్ల శైలజ నేడు హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంబేద్కర్ సంఘం నేతలు శ్రీనివాస్, శ్యామ్‌కుమార్, శంకరయ్య, గంగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చేందుకు నేడే ఆఖరు

సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ-2024 నియామకాల్లో భాగంగా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో వివిధ కేటగిరీల్లో నియామక పత్రాలు తీసుకున్న టీచర్ అభ్యర్థులందరూ మల్కాజిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో గురువారం జాయినింగ్ రిపోర్ట్ చేయనివారు ఈ నెల 11న సాయంత్రం 5 గంటల లోపు రిపోర్ట్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి తెలిపారు.

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: ప్రభుత్వం ఏర్పాటు చేసి మేడ్చల్ మార్కెట్ కమిటీకి ఏర్పాటు చేసిన నూతన పాలకవర్గంను రద్దు చేసి అందరికి ఆమోదయోగ్యమైన పాలకవర్గంను నియమించాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల, మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు గురువారం మేడ్చల్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించి సీనియర్లకు, పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకుని ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన వారికి, పార్టీని నమ్ముకుని 30ఏళ్ళ నుంచి పార్టీ కోసం ఉన్న సీనియర్లకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యకం చేశారు. మేడ్చల్ మండలంకు ఒక్క డైరక్టర్ పోస్టు కూడా ఇవ్వలేదని, మున్సిపాలిటీకి రెండు పదవులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తమకు జరిగిన అన్యాయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయన వద్దె తేల్చుకుంటామన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు వరదారెడ్డి, మురళీగౌడ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

బోడుప్పల్: బహిరంగ ప్రదేశాలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. 15వ డివిజన్ పరిధిలో టెలిఫోన్ కాలనీలో కనకయ్య అనే వ్యక్తి బహిరంగ ప్రదేశంలో చెత్త వేయగా ఇది గమనించిన శానిటరీ అధికారులు అతనికి రూ.5 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆటోలకు మాత్రమే చెత్తను అందించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కమలాకర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు


బతుకమ్మతో చిన్నారి


పూడూర్‌లో బతుకమ్మతో మహిళ


నాగారం వెస్ట్ గాంధీనగర్ కాలనీలో బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్‌చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

మేడ్చల్: మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాలలో బతుకమ్మ పండగను ఘనంగా జరుపుకున్నారు. మున్సిపాలిటీలోని అత్వెల్లి, కిష్టాపూర్, రాయిలాపూర్, పూడూర్, గిర్మాపూర్‌లలో మండలంలోని అన్ని గ్రామాలలో బతుకమ్మ పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయం అయిన సద్దుల బతుకమ్మ పండుగను ప్రజలు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు గునుగు, తంగేడు, చామంతి, బంతి లాంటి వివిధ రకాల పూలతో బతుకమ్మను తయారు చేసి అందులో గౌరమ్మను పెట్టి పూజలు చేస్తారు. ఇంటిముందు వాకిట్లో ముగ్గులు పెట్టి బతుకమ్మ పాటలు పాడుతూ పండుగను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ సంబరాలలో భాగంగా మహిళలు నూతన వస్త్రాలు ధరించి ఉదయం నుంచి రాత్రి వరకు బతుకమ్మ పండుగ ఉత్సవాలలో మునిగితేలారు. ప్రధాన కూడలిలో బతుకమ్మ ఆటల అనంతరం గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు. గ్రామాలలో ఎక్కడ చూసినా పండగ వాతావరణం కనిపించింది. అధికారులు చెరువుల వద్ద తగు ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం కాస్త వర్షం పడడంతో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు పడ్డారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ

సాక్షి సిటీ బ్యూరో: మల్కాజిగిరి-మేడ్చల్ కలెక్టరేట్‌లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆడబిడ్డలకు విశిష్టమైన బతుకమ్మ పండుగను జిల్లా సంక్షేమశాఖ నిర్వహించింది. ఈ వేడుకల్లో జిల్లాలోని ఐసీడీఎస్ శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఇందులో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా లా-ఆఫీసర్ చంద్రావతి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులతో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ బతుకమ్మలకు పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ పాటలకు కోలాటం చేస్తూ ఉత్సాహంగా నృత్యాలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మహిళలకు ప్రసాదాలు, పండ్లు, మంచినీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ మాట్లాడుతూ.. తెలంగాణలో బతుకమ్మకు ఘన చరిత్ర ఉందని, ఆడపడుచులకు ఎంతో ప్రీతిపాత్రమైన పండుగని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ సంబురాలను విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న తాటికొండ సంతోష్ కుమార్ కీలక పాత్రపోషించారు.

వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

మేడ్చల్‌రూరల్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా సాగాయి. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు ఇళ్లలో రంగురంగుల పూలతో బతుకమ్మను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. చెరువుల వద్ద బతుకమ్మ వేడుకల సందర్భంగా ప్రత్యేక ఏర్పాటు చేయగా మహిళలు, చిన్నారులు, యువతులు బతుకమ్మ సంబరాలు జరుపుకుని అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేశారు.

కలెక్టరేట్‌లో..








పూడూర్‌లో బతుకమ్మ సంబరాల్లో మహిళలు


సోమారం గ్రామంలో..


గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో..


అంకుషాపూర్‌లో..


ఎదులాబాద్ పెరిక వాడలో..


కీసరలో..





101 రకాల వంటకాలతో అమ్మవారికి నైవేద్యం


అమ్మవారికి సమర్పించిన 101 రకాల నైవేద్యాలు


నవరాత్రుల్లో పాల్గొన్న నాయకులు

మేడ్చల్‌రూరల్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన అమ్మవారికి 101 ప్రత్యేక వంటకాలతో ఆడపడుచు సారెగా నైవేద్యం సమర్పించారు. భవాని మాలదారులు అశోక్ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక వంటకాలు, బోనాలతో గ్రామంలోని మహంకాళి ఆలయం నుంచి ఊరేగింపుగా దుర్గాదేవి మండపం వద్దకు తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ సరస్వతి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా..

దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.


రాంపల్లిలో దుర్గామాతను దర్శించుకుంటున్న ఎంపీ ఈటెల రాజేందర్ తదితరులు


అంకుషాపూర్‌లో అమ్మవారిని దర్శించుకున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య


మర్పల్లిగూడలో అన్నదానం చేస్తున్న మంకయ్య, తదితరులు

కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవుషాపూర్ దుర్గాదేవి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి దంపతులు, అమ్మవారి మాలదారులు హోమం నిర్వహించారు. అంకుషాపూర్‌లో జరిగిన అమ్మవారి పూజల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మర్పల్లిగూడలో చిలుగూరి మంకయ్య, నరేష్, కృష్ణ తదితరులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, జంగయ్యయాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, బాల్‌రాజ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా కీసరగుట్ట అమ్మవారు


దుర్గాదేవిగా కీసరగుట్ట అమ్మవారు


గడి మైసమ్మ అమ్మవారు

కీసర: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం కీసరగుట్ట శ్రీ భవానీశివదుర్గా అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం, ఈస్ట్ గాంధినగర్ కాలనీలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి పాల్గొన్నారు. మరోపక్క కీసర, చీర్యాల, అహ్మద్‌గూడ రాంపల్లిలో దుర్గామాతను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

దుర్గా దేవిగా గడి మైసమ్మ

మేడ్చల్: దేవీ నవరాత్రి ఉత్సవాలలో 8వ రోజైన గురువారం అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించి దర్శనం చేసుకున్నారు. వివిధ మండలపాల్లో, కాలనీల్లో, ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గడి మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గా దేవిగా అలంకరించి దర్శనం చేసుకున్నారు.


అంకుషాపూర్‌లో హోమం నిర్వహిస్తున్న, కొండల్‌రెడ్డి, మాలదారులు

రతన్ టాటాకు ఘన నివాళి


రతన్‌టాటాకు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్: ప్రపంచ దిగ్గజ పారిశ్రామిక వేత్త రతన్‌టాటా అకాల మరణంతో మేడ్చల్ బీజేపీ నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు. పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశ్రామికవేత్తగా, దాతగా, దేశానికి చేసిన సేవలు గొప్పవని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, రాజు, సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళులర్పించిన యువకులు

మేడ్చల్‌రూరల్: పారిశ్రామిక దిగ్గజం అకాల మరణంతో మేడ్చల్ మున్సిపల్ పరిధి పూడూర్ యువకులు శ్రద్ధాంజలి ఘటించారు. కేఆర్‌ఎఫ్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కందుకూరి సాయికుమార్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు గాంధీ విగ్రహం సమీపంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు శ్రీకాంత్, గౌతమ్, మహేష్, సురేందర్ పాల్గొన్నారు.


రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న యువకులు

దసరాకు ఊరు వెళ్తున్నారా! జర జాగ్రత్త..


జాగ్రత్తలపై ప్రచారం ఆటోను ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)

ఘట్‌కేసర్: దసరా వేడుకలకు సొంతూర్లకు వెళ్లేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. ప్రతి ఒక్కరూ పిల్లాపాపలతో సొంతూరు ప్రయాణానికి అంతా సిద్ధం అవుతుంటారు. ఈ సమయం కోసమే చోరులు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుంటారు. పగలు రెక్కీ నిర్వహించి చీకటి పడగానే ఇళ్లల్లోని నగదు, బంగారు ఆభరణాలు, విలువైన ఇతర వస్తువులు ఎత్తుకెళ్తుంటారు. చోరీలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో చోరీలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

పోలీస్ శాఖ సూచనలు..

దసరాకు ఊరికి వెళ్లేవారు వీలైనంత వరకు ఇంటిలో విలువైన ఆభరణాలు, విలువైన వస్తువులు పెట్టకూడదు. ఇంటి పక్క వారికి, నమ్మకస్తులను నిఘా పెట్టాలని కోరారు. వాహనాలను ఇంటి లోపల పెట్టడంతోపాటు పేపర్ బాయ్, పాలవాళ్ళకి రావొద్దని చెప్పాలి. ఇంటిలో ఒక లైటు వేసి ఉంచాలి. డోరుకు వేసిన తాళం కనిపించకుండ డోర్ కర్టన్ వేయాలి. గేటుకు లోపలి నుంచి తాళం వేసి డోర్‌కు సెంటర్ లాక్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి. ఇంటిలో సీసీ కెమెరాలు బిగించుకొని మొబైల్ యాప్ ద్వారా సీసీ కెమెరాల దృశ్యాలు వీక్షిస్తుండాలి. ప్రధాన ద్వారం వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలి. నివాస ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపించిన వెంటనే 100 డయల్ కాల్ చేసి సమాచారం ఇవ్వాలి. బస్సులు, రైళ్లో ప్రయాణించే సమయంలో గుర్తు తెలియని అపరిచిత వ్యక్తుల నుంచి తినుబండారాలు స్వీకరించకూడదు.

గత సంఘటనలు దృష్టిలో పెట్టుకొని పెట్రోలింగ్..



గతంలో జరిగిన ఘటనలు దృష్టిలో పెట్టుకొని పెట్రోలింగ్, ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తాం. కాలనీల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే 100 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వండి. చోరీలు జరగకుండా పోలీస్‌శాఖకు ప్రజలు సహకరించాలి.

– పరశురాం-ఇన్‌స్పెక్టర్ ఘట్‌కేసర్